క్లుప్తంగా

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి



నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి గుణాత్మకమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు అన్నారు. మండలంలోని కొల్లంపల్లి కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులను బేస్ లైన్ నుంచి మిడ్ లైన్ వరకు జరిగిన అభివృద్ధిని పరిశీలించుకుని ఎండ్ లైన్ పూర్తయ్యేలోపు చక్కటి సామర్థ్యాలను పెంపొందించాలన్నారు.

పాఠశాల తనిఖీ..
కొల్లంపల్లి జెడ్పీ ఉన్నత, ఎంపీ ప్రాథమిక పాఠశాలలను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం అనురాధ, ఎంఈఓ బాలాజీ, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించాలనే తపన ఉండాలి



మరికల్: ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపన విద్యార్థుల్లో ఉండాలని రిటైర్డ్ జీహెచ్ఎం సుందరయ్యశర్మ అన్నారు. మరికల్‌లో పేద కుటుంబానికి చెందిన స్వాతి ఇటీవల ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించడంతో ఆమెను సన్మానించి అభినందించారు. తల్లిదండ్రుల కష్టానికి ఉద్యోగం సాధించడం గౌరవంగా ఉందన్నారు. మిగత విద్యార్థులు ఆమెను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సుధాకర్, చెన్నారెడ్డి, చెన్నయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలు నెరవేర్చండి

నారాయణపేట రూరల్: తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని, అందుకు అనుగుణంగా విద్యార్థులు కష్టపడాలని సీఐ శివశంకర్ అన్నారు. పట్టణంలోని మిల్కసింగ్ డిఫెన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత ఆర్మీ శిక్షణ తరగతులు ప్రారంభించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాఘవేందర్ రెడ్డి, డైరెక్టర్ మహేష్, ఉపాధ్యాయులు నగేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

బాలికా సాధికారతపై అవగాహన

మద్దూరు: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలికా సాధికారతపై మండలంలోని దోరేపల్లి ఉన్నత పాఠశాల, మద్దూరులోని గురుకుల పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికా సాధికారతపై ప్రవేశపెట్టిన పథకాలు, చట్టాలు, తదితర అంశాలను కేంద్ర కోఆర్డినేటర్ నర్సింహులు వివరించారు. అనంతరం కళాకారుల ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అనిత, యాదగిరి, ఎల్లప్ప, సాయి, రాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మక్తల్: కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి కర్నూల్ వెళ్తున్న కారు సోమవారం మక్తల్ మండలం మొందల్‌కుంట గ్రామ శివారులో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న 5 మందికి ఏప్రమాదం సంభవించలేదు. శాంతి (27)కి స్వల్పగాయాలు కావడంతో 108లో మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ నిద్ర పోవడం వల్లనే ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు.

ఎంఎల్‌సీకి పుష్పగుచ్ఛం అందజేత




మక్తల్: తెలంగాణ మహిళా జాగృతి అధ్యక్షురాలు ఎంఎల్‌సీ కవితను సోమవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఉద్యమకారుడు రుద్రసముద్రం రాంలింగం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పాలమూరు జిల్లాలో మహిళా కమిటీలు వేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామ శివారులో సోమవారం కృష్ణానది నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేసినట్లు ఎస్ఐ ఎండీ నవీద్ తెలిపారు. ఇసుక ట్రాక్టర్ యజమాని ముడుమాల్‌కు చెందిన గడుగు వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు



మక్తల్‌లోని మల్లికార్జునస్వామి దేవాలయం

- మల్లికార్జునస్వామి దేవాలయంలో ఏర్పాట్లు
- 26న మహాశివరాత్రి



ఆలయంలో వెలిసిన శివలింగం

మక్తల్: మక్తల్ పట్టణంలో కొలువుదీరిన మల్లికార్జునస్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా 25 నుంచి 27వరకు వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామివారి ఉత్సవాలు ధ్వజారోహణం, కలశపూజతో ప్రారంభమవుతాయి. కృష్ణానది నుంచి పవిత్ర జలాలు తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం నిర్వహిస్తారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా 26న తెల్లవారుజామున మల్లికార్జునస్వామికి మహారుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి తిప్పయ్యస్వామి తెలిపారు. అదే రోజు ఉదయం 9గంటలకు మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం ఉంటుందని ఆయన తెలిపారు. బిల్వార్చన కార్యక్రమం, సాయంత్రం 5గంటలకు స్వామివారి పల్లకీసేవ, పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించనున్నారు.

ఆలయ ప్రాశస్తి..
మక్తల్‌లో కొలువుదీరిన మల్లికార్జునస్వామి దేవాలయాన్ని 1205లో కాకతీయుల కాలంలో నిర్మించినట్లు ఇక్కడి శిలాశాసనాల ద్వారా తెలుస్తుంది. పూర్వం కాకతీయుల పరిపాలనలో రాణి రుద్రమదేవి సేనాధిపతి సూర్యదేవరరాయ సింగన్న భూపతి మక్తల్‌కు వచ్చినప్పుడు ఈ ఆలయాన్ని సందర్శించినట్లు ఆలయ ముఖద్వారంలో ఏర్పాటు చేసిన శిలాఫలకంలో చెక్కబడి ఉంది. ఈ ఆలయం నుంచి కింది భాగంలో ఒక సొరంగ మార్గం శ్రీశైలం వరకు ఉన్నట్లు ఇక్కడ ఇందుకు సంబంధించిన చారిత్రక ఆధారాలు ఉన్నట్లు ప్రముఖ కవి, పురావస్తు శిలా శాసనాల పరిశీలకుడు గడియారం రామకృష్ణ శర్మ పేర్కొన్నారు. అప్పట్లో మక్తల్‌ను మఖస్థల్‌గా పిలిచే వారు. మఖ అనగా యజ్ఞం, స్థల్ అనగా స్థలం అంటే యజ్ఞం చేసే స్థలం అని సంస్కృతంలో చెప్పబడి ఉంది. కాలక్రమేణ ఇది మక్తల్‌గా మారింది. ఇక్కడ మల్లికార్జునస్వామి దేవాలయంలో పూర్వ మునులు, దేవతలు యజ్ఞ యాగాలు చేసే వారు. అందువల్ల ఈ దేవాలయానికి ఎంతో చారిత్రక ప్రాశస్తి ఏర్పడింది. అంతే కాకుండా ప్రసిద్ధ ద్వాదశ లింగాల్లో ఐదోది శ్రీశైలం కన్న ముందు మక్తల్‌లోనే శివలింగ ప్రతిష్ఠాపన జరిగినట్లు ప్రతీక. మహాశివరాత్రి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

నేడు ఉమామహేశ్వర ఆలయం ముస్తాబు

మక్తల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మక్తల్ పట్టణంలో అజాద్‌నగర్‌లో ఉమామహేశ్వరుల ఆలయంలో విద్యుత్ కాంతులతో అలంకరణ చేశారు. 26న మహారుద్రాభిషేకం, రాత్రి 9గంటలకు ఉమామహేశ్వరుల కల్యాణోత్సవం ఉంటుందని ఆలయ పూజారి సిద్ధరామయ్య తెలిపారు. అర్ధరాత్రి 11గంటలకు జాగరణ కార్యక్రమం లింగోద్భవ అభిషేకం ఉంటుందని తెలిపారు. అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అన్నదానం ఉంటుందని తెలిపారు.



మక్తల్లో విద్యుత్ కాంతులతో అలంకరించిన ఉమామహేశ్వరుని ఆలయం

కుంబేశ్వర ఆలయంలో..
మక్తల్: పట్టణంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా కుంబేశ్వర ఆలయంలో పెద్ద శివలింగ, బ్రహ్మసూత్ర శివలింగం ఉండడంతో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 25న మృత్యుంజయ హోమం, సహస్ర కలశాభిషేకం, 26న శివపార్వతులకు కల్యాణోత్సవం, బిల్వార్చన ఉంటుందని తెలిపారు. కార్యక్రమలలో భక్తులు పాల్గొని విజయవతం చేయాలని కోరారు.

శివపార్వతుల కల్యాణ వేడుకలు



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

కోస్గి: పట్టణంలోని తిమ్మనబావి శివాంజనేయ స్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. శివ మాలధారణ చేసిన స్వాములు రుద్రాక్షాల మఠం అమరలింగ స్వామి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొని శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మొదటి రోజు గణపతి పూజ, గౌరిపూజ, తదితరల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం మహా మంగళ హారతి, తీర్థప్రసాద వితరణ చేశారు. ఉత్సవమూర్తులకు అభిషేకం చేసి వీరభద్ర స్వామి దేవాలయం నుంచి తిమ్మన బావి శివాంజనేయ స్వామి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు డీటీఎస్ రాము, తెలుగు నరేష్, కొడిగంటి హరి, మాసుల రాధ, పాశం వెంకటయ్య, కూర మల్లారెడ్డి, డాకూ బాల్‌రాజ్, సుమన్, పలువురు శివమాలధారులు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామి క్షేత్రం ముస్తాబు



మక్తల్: మక్తల్ మండలం వల్లభాపుర దత్తక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కృష్ణానది తీరాన వెలసిన జగద్గురు దత్తాత్రేయస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి 28 వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. 26న రథోత్సవం ఉంటుందని దత్త పీఠాధిపతి, నిర్వాహకులు, ట్రస్టు కమిటీ సభ్యులు తెలిపారు. 27న శివపార్వతుల కల్యాణోత్సవం, మార్చి2న రేణుక మాత బోనాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్రీడాకారులను అభినందించిన కలెక్టర్



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్

నారాయణపేట/నారాయణపేట రూరల్: క్రీడల్లో రాణించి జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ క్రీడాకారులకు సూచించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన జాతీయ 16వ బాలుర యూత్ అథ్లెటిక్స్ చాంపియన్షిప్ రాష్ట్ర మీట్ జావలిన్ త్రోలో సందీప్ బంగారు పతకం సాధించాడు. హై జంప్‌లో ప్రవీణ్ మూడో స్థానం, రెజ్లింగ్ పోటీలలో మొదటి బహుమతి సాధించిన నాగలక్ష్మిని కలెక్టర్ శాలువాతో సన్మానించారు. జాతీయ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్షిప్ పోటీల్లో విజేతలైన జిల్లా క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. క్రీడాకారులను ఆమె అభినందించి, మెడల్ ప్రశంసా పత్రం అందించారు.

విద్యార్థులకు వరం ఏఐ బోధన
నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ ప్రాథమిక పాఠశాలలో ఏఐ ల్యామ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా పైలెట్‌గా ఎంపిక చేసిన 10 పాఠశాలలో 114 మంది విద్యార్థులకు ఏఐ ఆధారిత అభ్యసనం అందించేందుకు ఆయా పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌లు ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఏఐ బోధన ఒక వరం లాంటిదని, విద్యార్థుల అభ్యసనం మరింత ఆకర్షణీయంగా, ఇంటరాక్టివ్‌గా నిర్వహించుటకు ఏఐ బోధన ఎంతో సహకరిస్తుందన్నారు. ఎంపిక చేయబడ్డ 10 పాఠశాలలో 3,4,5 వ తరగతి విద్యార్థులకు వారానికి రెండు రోజుల పాటు 45 నిమిషాల అభ్యసనం ల్యాబ్ ద్వారా నిర్వహిస్తామని డీఈఓ గోవిందరాజులు తెలిపారు. జిల్లాలో గుండుమాల్, గుడెమలూర్, శివాజీనగర్ నారాయణపేట, కర్ని, కంసాన్‌పల్లి, పల్లెర్ల, నిడ్జింత, కొల్లంపల్లి, నాచారం పాఠశాలలో ప్రయోగాత్మకంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత ఐశ్వర్యానికి బాట

నారాయణపేట: ఆర్థిక అక్షరాస్యత ఐశ్వర్యానికి బాట వేస్తుందని, ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు ఈనెల 24 నుంచి 28 వరకు నిర్వహించడంలో భాగంగా సోమవారం ఆర్‌బీఐ వారు ప్రచురించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం విజయ్‌కుమార్ మాట్లాడుతూ 24 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలోల మహిళలను మూడు వర్గాలుగా గుర్తించనున్నట్లు తెలిపారు. జీతాలు తీసుకునే, వ్యాపారాలు చేసే, గృహిణులకు ఆర్థిక అక్షరాశ్యత కేంద్రాలు, బ్యాంకులు ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్సవమూర్తుల ఊరేగింపు



కొత్తపల్లి: మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి ఆలయ నూతన నిర్మాణంలో భాగంగా ఉత్సవ మూర్తులను ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. సోమవారం ప్రధాన పూజారులు గణపతి పూజ, స్వస్తి పుణ్యావాచనం, అఖండ దీపారాదన,, అష్టదిక్పాలకుల పూజ, ద్వార పూజ, మండప ప్రవేశం, విగ్రహాలకు జలాదివాసం, ప్రదోష పూజ, స్వస్థి వాచనం, మహా మంగళహారతి నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన పూజారులు రామాచారి, కృష్ణ బట్ల, అమర్ జ్యోషి, లక్ష్మీ కాంతాచారి, అనిల్‌కుమార్ జ్యోషి, రవికుమార్ జ్యోషి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు

దామరగిద్ద: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఎల్ఎఫ్ఎన్ శిక్షణ తరగతులు సోమవారం రెండో రోజు జీహెచ్ఎం అశోక్ కుమార్ సమక్షంలో కొనసాగాయి. మండల విద్యాధికారి కృష్ణారెడ్డి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి 40 రోజుల పాటు ఫండమెంట్ లిటరసీ న్యూమరిక్ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని విజయవంతం చే యాలన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

నారాయణపేట: నారాయణపేట జిల్లాలో మీడియాలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు వెంటనే ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు లొట్టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలపై సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు నిరసన తెలిపారు.

ఘనంగా మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



మరికల్: మండల కేంద్రంలో కనుల పండువగా సోమవారం మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు పూజలందుకున్న అమ్మవారిని చివరిరోజు నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచడం దారుణం

నారాయణపేట: శివరాత్రి పర్వదిన సందర్భంగా శ్రీశైలానికి వెళ్లే ఆర్టీసీ బస్సుల చార్జీలు 50 శాతం పెంచడం దారుణమని బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్యయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిందువుల పర్వదినాల సమయంలోనే ఇలా ఆర్టీసీ చార్జీలు పెంచడం ఎంత మేరకు సమంజసమని పేర్కొన్నారు. పెంచిన ఆర్టీసీ చార్జీలు తక్షణమే తగ్గించాలని, ఒకవైపు మైనార్టీల ఆధ్యాత్మిక యాత్రలకు ప్రోత్సాహకాలు అందిస్తూ, మరోవైపు హిందువుల పర్వదినాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఖజానా నింపే అవకాశంగా మలచుకుంటోందని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను హిందువులు సంఘటితమై ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని తెలిపారు. ఆర్టీసీ బస్సుల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు.

బుక్‌కీపర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

మక్తల్: మండలంలోని గుడిగండ్ల బుక్‌కీపర్‌పై నారాయణపేట కలెక్టర్‌కు గ్రామ మహిళా సంఘాల గ్రూపు లీడర్లు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో రెండు మహిళా సంఘాల్లో ఒక దాంట్లో రూ.92 వేలు, మరొక దాంట్లో రూ.65 వేలు శ్రీనిధికి జమ చేయగా, బుక్‌కీపర్ అందులో జమ చేయలేదని పేర్కొన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రూపులీడర్లు ఆశాబీ, జైనాబీ, రేణుక, మణేమ్మ, అనసూయమ్మ, చిట్టెమ్మ, అంజమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ ఆపరేటర్ వచ్చేశారోచ్!

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏం జరుగుతోంది?
- ఎమ్మెల్యేను తప్పుదోవ పట్టించారా?
- గత కలెక్టర్ తొలగించారు, మళ్లీ ఎంట్రీ ఇవ్వడంతో చర్చనీయాంశం



ఎమ్మెల్యే ఇచ్చిన లేఖను చూపిస్తున్న సబ్‌రిజిస్ట్రార్ రాంజీ

నారాయణపేట: నారాయణపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత కొన్నేళ్లుగా అనధికారికంగా విధులు నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ వ్యక్తిని నాటి కలెక్టర్ కోయ శ్రీహర్ష తొలగించిన విషయం పాఠకులకు విధితమే. తాజాగా సదరు వ్యక్తి తమ పలుకుబడి, అన్ని అస్త్రాలను ఉపయోగించి ఎమ్మెల్యే సిఫార్సు లేఖతో సోమవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మళ్లీ డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా రావడంతో జిల్లా కేంద్రంలో సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. అసలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏమి జరుగుతోందని ఎవరినోటా విన్నా ఇదే మాట వినిపిస్తోంది. గత కలెక్టర్ ఈ వ్యవహారం సీరియస్‌గా తీసుకొని తొలగించిన వ్యక్తిని నారాయణపేట ఎమ్మెల్యే సిఫార్సు లేఖతో కార్యాలయంలో మళ్లీ తీసుకుంటున్నట్లు సబ్ రిజిస్ట్రార్ రాంజీ స్వయంగా చెప్పడాన్ని చూస్తుంటే ముక్కున వేలు వేసుకోవాల్సిందే మరి.

రిమార్క్‌తో తొలగించారు..
గత కొన్నేళ్ల నుంచి అనాధికారికంగా నారాయణపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనసాగి రిమార్క్ పొందిన వ్యక్తిని గత కలెక్టర్ తొలగించారు. గత ఏడాది జూలై 27న అప్పటి కలెక్టర్ కోయ శ్రీహర్ష తనిఖీ సమయంలో ఈ వ్యవహారం బట్టబయలైంది. ఆ తర్వాత 15 రోజులకు కలెక్టర్ మరోమారు తనిఖీకి వెళ్లిన సమయంలో పూర్తి స్థాయి వివరాలు సేకరించి ఆ శాఖ ఉన్నతాధికారులకు ఓ నివేదికను పంపించారు. అప్పటి నుంచి సదరు ప్రైవేట్ వ్యక్తి కార్యాలయానికి దూరంగా ఉంటూ వచ్చారు. ఇంటి దగ్గర, మరి కొన్నాళ్లు కార్యాలయం బయట రైటర్‌గా కొనసాగుతూ వచ్చారు. ఆకస్మాత్తుగా సోమవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సదరు వ్యక్తి ప్రత్యక్షమై అటు కార్యాలయ సిబ్బందిని, ఇటు డాక్యుమెంట్ రైటర్లను ఆశ్చర్యపరిచారు. సబ్ రిజిస్ట్రార్ కథనం మేరకు ఎమ్మెల్యే మేడం చెప్పారు కాబట్టి ఆయన సేవలను తీసుకుంటున్నట్లు గంట పతంగా చెప్పారు. ఎమ్మెల్యే ఇచ్చిన సిఫారసు లేఖను చూయిస్తూ చిందులు వేశారు. ఈ విషయం సబ్ రిజిస్ట్రార్ రాంజీని వివరణ కోరగా సిఫారస్ లెటర్ ఇవ్వడం, డీఆర్ఓ నుంచి మౌఖిక ఆదేశాలు రావడంతోనే డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా తీసుకున్నట్లు చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న హౌసింగ్ డిప్యూటీ డీఈ హరికృష్ణ

కోస్గిరూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి హౌసింగ్ డిప్యూటీ డీఈ హరికృష్ణ భూమిపూజ చేశారు. సోమవారం మండలంలో ఎంపిక చేసిన చంద్రవంచ గ్రామంలో దంపతులు గోవిందు, గౌరమ్మల ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 193 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. లబ్ధిదారులందరు ఇళ్లు కట్టుకోవాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు విడతల వారీగా నిధులు మంజూరవుతాయన్నారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలన్నారు. మొక్కలు పెంచుతున్న నర్సరీని పర్యావేక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రఘువర్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సునిత, నారాయణరెడ్డి, యాదిరెడ్డి, అనంతయ్య, తదితరులు ఉన్నారు.

పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

మద్దూరు: అల్లీపూర్ గ్రామానికి చెందిన ఎల్లప్పను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విక్షణ రహితంగా కొట్టిన మద్దూరు ఎస్ఐ విజయ్‌కుమార్, కోస్గి సీఐ సైదులు ఇతర పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని దౌల్తాబాద్ మాజీ జెడ్పీటీసీ మహిపాల్, బీజేపీ మండలాధ్యక్షుడు శంకర్, ముదిరాజ్ సంఘం నాయకులు వెంకటయ్య, రాములు, సాయిలు, నర్సింహులు, కాశీ, నరేష్, భీములు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బాధితుడు ఎల్లప్పతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. తన తల్లికి రావాల్సిన డబ్బులను అడిగితేనే ఎల్లప్పపై ఎలాంటి కేసు నమోదు చేయకుండా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విక్షణ రహితంగా కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఫోన్ చేసి చెబితే విచక్షణ రహితంగా థర్డ్ డిగ్రీ ఉపయోగించడం అనైతికమన్నారు. పోలీసులపై, గ్రామ నాయకుడిపై చర్యలు తీసుకోకపోతే బీసీ, ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

సాంకేతిక విజ్ఞానంతో సామర్థ్యం మెరుగు



సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు



గుడెబల్లూర్‌లో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎంఈఓ నిజాముద్దీన్

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ పోగ్రాం)కు పైలట్ ప్రాజెక్టుగా మక్తల్ మండలం కర్ని ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేశారు. నారాయణపేట కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం పాఠశాలలో ఎంఈఓ అనిల్‌గౌడ్ ఏఐ పోగ్రాం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో 10 పాఠశాలలను ఏఐ పోగ్రాం కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా కర్ని పాఠశాలను ఎంపిక చేయడం ఎంతో అభినందనీయమన్నారు.

ఏఐతో మెరుగైన అభ్యసన..
దామరగిద్ద: కృత్రిమ మేధ (ఏఐ) డిజిటల్ బోధన ద్వారా వెనుకబడిన విద్యార్థుల్లో దాగి ఉన్న అభ్యసన సామర్థ్యాలు మెరుగు పరిచేందుకు ఎంతగానో దోహద పడుతుందని ఎంఈఓ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కంసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా కంసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్సీ(ఏఐ) డిజిటల్ బోధన తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం సత్యనారాయణ అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ భీమమ్మ, పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం
కృష్ణా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కృత్రిమ మేధ(ఏఐ)ద్వారా విద్యార్థులకు బోధన సామర్థ్యం పెరుగుతుందని ఎంఈఓ నిజాముద్దీన్ అన్నారు. మండలంలోని గుడెబల్లూర్ ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ప్రభుత్వం మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులు చదువులో వెనుకబడిన వారిని మెరుగుపర్చేందుకు ఏఐ విద్యను ప్రారంభించినట్లు తెలిపారు. మండలంలోని గుడెబల్లూర్, ముడుమాల్ గ్రామాల్లో ప్రారంభించినట్లు తెలిపారు.

విద్యాబోధనలో సాంకేతిక విప్లవం..
కోస్గి రూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన కృత్రిమ మేధ ద్వారా విద్యాబోధనలో సాంకేతిక విప్లవం వస్తుందని ఎంఈఓ శంకర్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాచారం ప్రాథమికోన్నత పాఠశాల, గుండుమాల్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ ప్రారంభించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



డీపీఓకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

నారాయణపేట రూరల్: జీపీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ డీపీఓ కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, నరసింహులు మాట్లాడారు. కోర్టు తీర్పునకు అనుగుణంగా జీపీ కార్మికులకు సమాన పనికి సమాన వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి అన్ని రకాల పనులకు అవసరమైన కార్మికులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, నరసింహులు, సాయిలు, కిష్టప్ప, నాగప్ప, తిరుమలేష్, దస్తప్ప, భారతమ్మ, నరసమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.